మాతల్లి అలమేలుమంగ ఆమె
మనసేమో ఉప్పొంగు అనురాగగంగ
ఆగంగ స్నానాలు ఆనందగానాలు
అందించు మముబ్రోచు కరుణాంతరంగ

౧. ఆపదలెడబాపు ఆకంటిచూపు
నిలుపును మునిమాపు మాఇంటిపైపు
ఆదరణకు రూపు ఆమె ఈ ఇలవేల్పు
వేంకటేశుని రాణి అలివేణి మాప్రాపు

౨. నయన వికాసాలు నవనందనాలు
హాసవిలాసాలు హరిచందనాలు
మృదుపదకమలాలు యదనిల్చినచాలు
శ్రీమన్మహాలక్ష్మి సిరులిచ్చువేవేలు

౩. సేవించువారికి శ్రీరామరక్ష
సద్భక్తవరులకు సంక్షేమదీక్ష
దీనసుజనరక్ష దేవికి ధృడదీక్ష
తిరుమలేశుని దేవి ఆశ్రితజనపక్ష